www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

శుక్రవారం, 17-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :78 Issue : 78 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## రథయాత్ర పర్వదినం సందర్భంగా ప్రధాని శుభాకాంక్షలు



5




## ప్రభాస్ 'ఫౌజీ' అప్‌డేట్ వచ్చేసింది..

8

# సీతారామ ప్రాజెక్టుపై తగ్గేదే లేదు..



- సీతారామ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు
- రీడిజైన్‌పై కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం
- ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆశ్వి అప్డేట్స్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే

మిగతా 3వ పేజీలో..

# కాళేశ్వరం విఫలానికి గత ప్రభుత్వ అవినీతి కారణం

- బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ విమర్శలు
- రీ-డిజైనింగ్ పేరుతో భారీ వ్యయం
- కాళేశ్వరం కూలడానికి కమిషన్లే కారణం
- బ్యారేజీల మరమ్మతులకు ప్రభుత్వం సిద్ధం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆశ్వి అప్డేట్స్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను సందర్శించిన అనంతరం గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2023లో తాను ఇరిగేషన్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి శాఖపై లోతుగా సమీక్షలు

మిగతా 2వ పేజీలో..



## 'నాడు కరెంట్ పోతే వార్త.. నేడు ఉంటేనే వార్త'..

- అప్రకటిత కోతలు: కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.
- రైతుల జాగారం: త్రీ-ఫేజ్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పొలాల వద్దే కాపలా కాయాల్సి వస్తోంది.
- నాడు - నేడు: గతంలో కరెంట్ పోతే వార్త... నేడు కరెంట్ ఉంటేనే వార్త అన్నట్టుగా తయారైంది.

2





# ప్రతిభకు పురస్కారం.. ఉద్యోగాల భరోసా!

- క్రీడా రంగానికి ప్రభుత్వం అండ.. విజేతలకు నగదు ప్రోత్సాహం
- హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టుకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు
- హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టుకు నగదు చెక్కులు అందజేసి అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.
- క్రీడల్లో రాణించే ప్రతిభావంతులకు నగదు బహుమతులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల కల్పన.
- రాష్ట్రంలో ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ అమలు మరియు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జూలై 16:**

తెలంగాణలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన సీజన్ 1 టీజీ20 క్రికెట్ లీగ్లో విజేతగా నిలిచిన

మిగతా 3వ పేజీలో..






## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్

2

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. త్వరగా కోలుకుని విధుల్లోకి రావాలని ఆకాంక్ష

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..



- 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి
- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

3



4

## సైబర్ నేరాలే అతి పెద్ద సవాలు..

- సాంకేతికతతో ఎదుర్కోవాలి: డీజీపీ సి.వి. ఆనంద్
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్ష – AI ఆధారిత సేవలు విస్తరించాలని ఆదేశం

## "ఢిల్లీ వేదికగా రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు"



- జారుడు బండపై సీఎం రేవంత్
- కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరాన్ని ఎండబెట్టారు
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ఏపీ బాగా ప్రయత్నిస్తోంది
- తెలంగాణలో కాంగ్రెస్ కనుమరుగవడం ఖాయం
- భాజపాకు అధికారం కల్ల
- టీఆర్‌ఎస్ పేరు వాడుకోవడాన్ని కచ్చితంగా వ్యతిరేకిస్తాం
- విలేకర్లతో కేటీఆర్

**తెలంగాణ ఆశ్వి అప్డేట్స్**

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు జారుడు బండపై ఉన్నారు. పోయేకొద్దీ పాతాళానికి జారడం తప్పితే లేవడం ఉండదు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడం కల్ల. వచ్చే ఎన్నికల్లో భారాస బంపర్ మెజార్టీతో గెలుస్తుందని సీఎం చేయించిన నాలుగు సర్వేల్లో తేలింది. అందుకే ఆయన నిస్పృహకు గురై కేసీఆర్‌పైనా, నాపైనా నోరు పారేసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి నేను వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా" అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు

మిగతా 2వ పేజీలో..



# హైదరాబాద్ మెట్రోలో నయా మార్పులు..

- హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1లో అదనపు కోచ్‌ల ఏర్పాటు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు హెచ్ఎంఆర్ఎల్ కీలక నిర్ణయం
- కోచ్‌ల కొనుగోలుకు చర్చలు జరపాలని అధికారులకు ఆదేశం
- రద్దీ స్టేషన్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్ 1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని

మిగతా 2వ పేజీలో..



# ఖమ్మంపై బీఆర్ఎస్‌ది రాజకీయ కక్ష..

- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేశారు: పొంగులేటి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం

2

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

2



# "ఢిల్లీ వేదికగా రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు"

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ తెలిపారు.

ఆదిలాబాద్‌లోని సీసీఐ సిమెంట్ కర్మాగారాన్ని కాపాడాలని కోరుతూ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలవడానికి ఢిల్లీ కొచ్చిన ఆయన బుధవారం సాయంత్రం పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. వివిధ అంశాలపై కేటీఆర్ మాట్లాడుతూ...

**24% వాటా ఉంటేనే డీలిమిటేషన్‌ను ఒప్పుకొంటాం**

"లోక్‌సభలో దక్షిణ భారతదేశానికి ఇప్పుడున్న 24% వాటాను యథాతథంగా కొనసాగించడానికి సిద్ధమైతే 50% సీట్ల పెంపునకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. అలాకాకుండా జనాభా ప్రాతిపదికన వెళ్తే ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం.

**ఎన్డీఎస్ఏను ఎందుకు కలవలేదు?**

ముఖ్యమంత్రి ఇప్పటికే 76సార్లు ఢిల్లీకొచ్చినా తెలంగాణకు 76పైసల సాయం అందలేదు. సీఎం నిజంగా రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకొచ్చి ఉంటే 'కాళేశ్వరం' నిర్వహణలో ప్రత్యామ్నాయాలపై చర్చించేందుకు ఎన్డీఎస్ఏను ఎందుకు కలవలేదు? అయినప్పటికీ సీఎం మాత్రం కేసీఆర్‌పై కక్షతోనే ఎన్డీఎస్ఏ నివేదికను సాకుగా చూపుతూ తెలంగాణను ఎండబెడుతున్నారు.

**ఏపీలో రైతుల ప్రయోజనాలను కాపాడుతున్నారు...**

కన్నెపల్లిలో పంపులు ప్రారంభించి రైతులకు నీళ్లిస్తే ఆ తర్వాత ఉచిత కరెంటు, యూరియా, పంటల కొనుగోలు, బోనస్ ఇవ్వాల్సి వస్తుంది. అసలు నీళ్లే ఇవ్వకుంటే ఆ బాధలన్నీ ఉండవన్న ఉద్దేశంతోనే గోదావరి నీటిని ఎత్తిపోయడం లేదు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎల్‌నినోకు సన్నద్ధంగా పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోసి అక్కడి రైతుల ప్రయోజనాలను కాపాడుతోంది. మేడిగడ్డకుపైన రూ.8.5 కోట్లతో కాఫర్‌డ్యాం కట్టి నీళ్లు ఎత్తిపోయొచ్చని ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న ఇంజినీర్లు నివేదిక ఇచ్చినా సీఎం రేవంత్ దాన్ని తొక్కిపెట్టారు. 2024 జూన్‌లోనే అన్నారం, సుందిళ్ల డ్యాంలకు మరమ్మతులు పూర్తయినట్లు ప్రభుత్వమే చెప్పినందున కన్నెపల్లి పంప్‌హౌస్ ఆన్‌చేసి ఆ నీటిని అన్నారం, సుందిళ్లలో కొంతమేర ఆపి అక్కడి నుంచి ఎల్లంపల్లికి తరలించొచ్చు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల దగ్గర పంపులు ఆన్ చేయడానికి ముఖ్యమంత్రికి కనిపించని అడ్డంకులు కన్నెపల్లి వద్దే కనిపించడానికి కారణం అహమే. ముఖ్యమంత్రి ఇంతలా ఒంటెత్తు పోకడలు పోతున్నా రాహుల్‌గాంధీ ఏం చేస్తున్నారో అర్థం కావడంలేదు. ఇదివరకు హిట్లర్‌ను ఆదర్శ పురుషుడిగా వర్ణించినా సీఎంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**కేసీఆర్ సంపద సృష్టించారు...**

కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.2.80 లక్షల కోట్ల అప్పుచేస్తే రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్లలోనే రూ.4లక్షల కోట్లు చేశారు. కేసీఆర్ అప్పులను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించడంతో ఇన్‌ల్యాండ్ ఫిషింగ్‌లో దేశంలోనే తెలంగాణ తొలిస్థానాన్ని ఆక్రమించగలిగింది. తద్వారా రూ.30 వేల కోట్ల సంపద సృష్టించగలిగారు. మా హయాంలో వరిసాగు 38 లక్షల ఎకరాల విస్తీర్ణం నుంచి 1.18 లక్షల ఎకరాలకు పెరగడంతో ధాన్యం దిగుబడిలో పంజాబ్, హరియాణాను అధిగమించగలిగాం. కేసీఆర్ అధికారం చేపట్టే నాటికి నెలకు రూ.4 వేల కోట్లమేర ఉన్న రాష్ట్ర ఆదాయాన్ని రూ.18 వేల కోట్లకు తీసుకెళ్లారు. కానీ, రేవంత్‌రెడ్డి హయాంలో అప్పులు పెరిగి అన్నీ తరిగిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరంగమూ దెబ్బతిన్నది. అందుకే ఆదిభట్లలో తీసుకున్న స్థలాన్ని వెనక్కి ఇచ్చేసి ప్రముఖ కార్పొరేట్ సంస్థ కాగ్నిజెంట్




చెన్నైకి వెళ్లిపోయింది.

**ఆయన 30% మినిస్టర్...**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మిస్టర్ 30%గా మారారు. ఆయన రాష్ట్రంలోని ప్రధాన భూములను నిషేధిత జాబితాలో చేర్చి 30% కమీషన్ ఇస్తేనే తొలగిస్తానని బెదిరిస్తున్నారు. మా హయాంలో నిషేధిత జాబితాలో 16 లక్షల ఎకరాలుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను దాంట్లో చేర్చి 30% దందా మొదలుపెట్టింది.

**రేవంత్‌రెడ్డి దురాశే మెట్రోకు శాపంగా మారింది...**

మెట్రో పేరు చెప్పి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్న రేవంత్‌రెడ్డి దురాశే ప్రాజెక్టు విస్తరణకు శాపంగా మారింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎయిర్‌పోర్టు నుంచి రాయదుర్గం వరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం... జీఎంఆర్, టీజీఐఐసీ, హెచ్‌ఎండీఏల భాగస్వామ్యంతో నిధులు సమకూర్చుకొని టెండర్లు పిలిచింది. అందులో ఎల్‌వన్‌గా వచ్చిన ఎల్‌అండ్‌టీకి 24 నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించింది. అది అలాగే సాగి ఉంటే ఇప్పటికే ఎయిర్‌పోర్టు మార్గం పరుగులు పెట్టేది. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దాన్ని ఆపేశారు. రెండో దశ పేరుతో... ఎల్‌అండ్‌టీ చేతుల్లో ఉన్న మొదటి దశను స్వాధీనం చేసుకొని ప్రజలపై రూ.14 వేల కోట్ల అప్పును రుద్దారు. ఎల్‌అండ్‌టీ చేతుల్లో ఉన్న 280 ఎకరాల భూములను కాజేసేందుకే రేవంత్‌రెడ్డి తొలిదశ ప్రాజెక్టును స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములను ఎవరికి అమ్ముతారో మాకు తెలుసు. మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకుంటేనే రెండో దశకు అనుమతిస్తామని కేంద్రం ఎక్కడ చెప్పిందో ఆధారాలు చూపాలని సవాల్ విసురుతున్నా.

**ఓటమికి మా పొరపాట్లే కారణం...**

'భారాస పాలనలో కేసీఆర్ అన్నివర్గాలకు ప్రయోజనాలు కల్పించినా కాంగ్రెస్ చెప్పిన అబద్ధపు హామీలను నమ్మి రైతులు, మహిళలు, విద్యార్థులు ఆశపడ్డారు. మేం గత ఎన్నికల్లో 1.5% ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు చెబుతున్నా... మా ఓటింగ్ శాతం 2018 నుంచి 2023 ఎన్నికలకు వచ్చేసరికి 47% నుంచి 37%కి పడిపోయింది. పలువర్గాలు దూరమవడంతోనే 10% ఓట్లు తగ్గాయి. ఇందులో మా పొరపాట్లు వంద శాతం ఉన్నాయి. వాటిని సరిదిద్దుకుంటాం. అధికారంలో ఉన్నప్పుడు మేం ఎలాంటి తప్పు చేయలేదు. అందుకే ఫార్ములా ఈ కేసులో నేను ఈ నెల 31న కోర్టుకు హాజరవుతున్నా. న్యాయం కోసం పోరాడతా'.

బండి సంజయ్‌పై నాకెలాంటి కోపంలేదు. సిరిసిల్లలో ఎదురుపడినప్పుడు నేనే ఆయన్ని పలకరించా. కానీ, కుమారుడి ఉదంతం తర్వాత పదవికి రాజీనామా చేసుంటే ఆయనకే గొప్ప పేరు వచ్చేది. ప్రస్తుత రాజకీయాల్లో నాకు రేవంత్‌రెడ్డితో తప్పితే ఎవ్వరితోనూ పంచా□తీ లేదు. రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను బాధ పెడుతున్నారన్న కోపం తప్పితే వ్యక్తిగత విభేదాలేమీ లేవు.

# కాళేశ్వరం విఫలానికి గత ప్రభుత్వ అవినీతి కారణం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

జరిపానని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అద్భుతాల ప్రచారమంతా పచ్చి అబద్ధమని తేలిపోయిందన్నారు. గత పాలకుల హయాంలో జలవనరుల శాఖలో అడ్డూఅదుపూ లేకుండా జరిగిన వందల కోట్ల అక్రమాలు, అవినీతి విచారణలో బయటపడ్డాయని ఆయన వెల్లడించారు.

**రీ-డిజైనింగ్ దోపిడీ.. లక్ష కోట్లు పెట్టినా సున్నా**

గత ప్రభుత్వం సగం పూర్తయిన ప్రాజెక్టులను సైతం కేవలం రీడిజైనింగ్ పేరుతో మార్చేసి అంచనా వ్యయాలను ఇష్టారాజ్యంగా పెంచిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో కనీసం దేవాదుల ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేయలేకపోయారని, సీతారామ ప్రాజెక్టు కోసం రూ. 8,000 కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితం రాలేదని మండిపడ్డారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అని డబ్బా కొట్టుకుంటూ దాదాపు లక్ష కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు నిట్టనిలువునా కూలిపోయింది. కేవలం కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. అన్నారం బ్యారేజీని ఒకచోట డిజైన్ చేసి, దానికి పూర్తి భిన్నంగా మరొక చోట నిర్మించారు. ఫలితంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం అసలు వినియోగానికే పనికిరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తేల్చి చెప్పింది" అని మంత్రి స్పష్టం చేశారు.

**రిపేర్లు పూర్తి చేస్తాం.. తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు**

కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ, అన్నారం,



సుందిల్ల బ్యారేజీల నుండి ఒక్క చుక్క నీటిని కూడా తీసుకోకుండానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా వరి పంట పండేలా చేసి చూపించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి సిద్ధంగా వచ్చిన కరువును చూపిస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం తాము పూర్తిగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందడుగు వేస్తున్నామని వివరించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను పునరావాసం (రిహబిలిటేషన్) పరిధిలోకి తెచ్చి, త్వరితగతిన రిపేర్లు పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఘోరమైన తప్పులన్నింటినీ సరిదిద్ది, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గవర్నర్, వైద్యులు సూచించిన విశ్రాంతి, చికిత్సను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య కొద్దిసేపు ఆప్యాయంగా భేటీ జరిగింది. పవన్ కళ్యాణ్ ఆరోగ్య పురోగతిపై వైద్యుల సూచనలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ సంపూర్ణంగా కోలుకోవాలని సూచించారు. అనంతరం పవన్ కళ్యాణ్ నివాసంలోని వ్యక్తిగత గ్రంథాలయాన్ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సందర్శించారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ రచయితలు, రాజ్యాంగ నిపుణులు, విధాన రూపకర్తలు, విశ్లేషకులు రచించిన పలు గ్రంథాలను ఆసక్తిగా పరిశీలించారు. పుస్తకాలపై పవన్ కళ్యాణ్‌తో చర్చిస్తూ వాటి విషయాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తన నివాసానికి వచ్చి పరామర్శించి ఆప్యాయత చూపినందుకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మంపై బీఆర్ఎస్‌ది రాజకీయ కక్ష..

- **సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేశారు: పొంగులేటి**
- **ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి**
- **సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు**
- **అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం**

**ఖమ్మం, ఆశ్వి అప్డేట్స్**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు



అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు.

"గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.




# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

- **అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ**
- **ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**
- **భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

# 'నాడు కరెంట్ పోతే వార్త.. నేడు ఉంటేనే వార్త'..

- **కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్!**

**హైదరాబాద్, ఆవ్వి అప్డేట్స్**

రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం వల్లే తెలంగాణ అంధకారంలోకి నెట్టబడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో బీఆర్ఎస్ హయాంలో కరెంట్ పోతే వార్తగా ఉండేదని, కానీ నేడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఉంటేనే వార్త అన్నట్లుగా పరిస్థితి మారిపోయిందని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**పీపీటీలు పెట్టి హెచ్చరించినా మేల్కోలేదు:**

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఈరోజు రాష్ట్రంలోని 11 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముందు రైతాంగం ధర్నాలు చేపట్టిందన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్లే కరెంట్ కోతలు వస్తున్నాయని హరీశ్ రావు అన్నారు. సింగరేణి బొగ్గు నిల్వలపై తాము



ముందే పీపీటీలు పెట్టి హెచ్చరించినా ప్రభుత్వం నిద్రలేవలేదన్నారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్‌లలో కేవలం 6 నుంచి 7 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని ఆరోపించారు. యాదాద్రి ప్లాంట్‌లో యూనిట్ 1, యూనిట్ 4లో బొగ్గు లేక ఉత్పత్తి నిలిచిపోగా, భద్రాద్రి ప్లాంట్‌లో నిర్వహణ వైఫల్యంతో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. అసలు విద్యుత్ కోతలు ఎందుకు వస్తున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని, రాష్ట్రంలో లోడ్ కేవలం 15 వేల మెగావాట్లు మాత్రమే ఉందని 7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి జరగడం లేదన్నారు. నిన్న కేవలం 3,190 మెగావాట్ల సామర్థ్యం మేర ఉత్పత్తి జరిగిందని ఉన్న సామర్థ్యంలో కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని ఆరోపించారు.

**అడ్డగోలు ధరలకు ఎందుకు కొంటున్నారు?:**

బొగ్గు సరఫరాలో, నీటి నిల్వల నిర్వహణలో, విద్యుత్ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. బొగ్గు, పవర్, సాండ్, ల్యాండ్ ఇలా కాంగ్రెస్ పాలన అంతా స్కాముల మయంగా మారిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గి సరఫరా తగ్గిందని అందుకే రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు పెడుతున్నారన్నారు. నీటిని లిఫ్ట్ చేసి రిజర్వాయర్లలో నీళ్లు నింపలేదు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని కూడా అసాధ్యం చేశారన్నారు. ముందస్తు ఆలోచనతో అయినా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సజావుగా జరిగేలా చూడలేదని. అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పవర్ ఎక్స్ఛేంజ్‌లో కొనుగోలు చేస్తున్నారని ఆ భారం వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు ఎందుకు భరించాలని ప్రశ్నించారు.

**సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి:**

సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి, సరఫరా, బొగ్గు నాణ్యత వివరాలు బయటకు రాకుండా చేశారు. నాణ్యమైన సింగరేణి బొగ్గును తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు పంపుతున్నారు. తెలంగాణకు మాత్రం లోక్వాలిటీ బొగ్గు పంపిస్తున్నారని ఆరోపించారు. 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయి. అందుకే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి జరగడం లేదన్నారు. రాష్ట్ర అవసరాలు, రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎందుకు పంపిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలన్నారు. మీ దగ్గర బొగ్గు ఉండి కూడా అడ్డగోలు ధరలకు పవర్ ఎక్స్ఛేంజ్‌లో విద్యుత్ ఎందుకు కొనుగోలు చేస్తున్నారు? ఎందుకు కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. త్రీ ఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పొలం వద్ద జాగారం చేయాల్సి వస్తోందన్నారు. మీది కోతల సర్కార్... వాతల సర్కార్ అన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే రాష్ట్ర రైతాంగం తరఫున బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.

# హైదరాబాద్ మెట్రోలో నయా మార్పులు..

**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది.

ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్ 1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు.

ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్‌లను కలుపుతూ పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు పేర్కొన్నారు.




## కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్రం, రాష్ట్రం, ఎన్‌డీఎస్ఏకు హైకోర్టు నోటీసులు

- **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై వివరణ కోరిన ధర్మాసనం.. విచారణ ఈ నెల 21కి వాయిదా**

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**


కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని బ్యారేజీల భద్రత, పునరుద్ధరణ పనుల అంశంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కన్నెపల్లి, సుందిళ్ల పంప్‌హౌస్‌ల భద్రత, ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ)తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ ఓ న్యాయవాది ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత కూడా మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, దీంతో గోదావరి జలాలు వినియోగం కాకుండా సముద్రంలోకి వృథాగా చేరుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లను ఎన్‌డీఎస్ఏ నివేదికలో సూచించిన విధంగా అత్యవసరంగా పునరుద్ధరించాలని పిటిషనర్ కోర్టును కోరారు. అలాగే మిగిలిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్‌హౌస్‌లపై కూడా ఎన్‌డీఎస్ఏతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ తరపు వాదనలు విన్న హైకోర్టు, కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన నిర్మాణాల భద్రత, వాటి ప్రస్తుత పరిస్థితి, చేపట్టిన చర్యలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ మరియు సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తూ, అప్పటిలోపు సంబంధిత అధికారులు తమ వివరణను సమర్పించాలని హైకోర్టు సూచించింది.

## నీట్ (యూజీ)–2026 తుది ఆన్సర్ కీ విడుదల

- **అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన ఎన్‌టీఏ.. అభ్యర్థులు వెంటనే పరిశీలించాలని సూచన**

**న్యూఢిల్లీ, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (NEETUG)-2026కు సంబంధించిన తుది ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ ప్రశ్నాపత్రానికి సంబంధించిన తుది ఆన్సర్ కీని పరిశీలించవచ్చని ఎన్‌టీఏ వెల్లడించింది. తుది ఆన్సర్ కీ ఆధారంగానే పరీక్ష ఫలితాలను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు అధికారిక పోర్టల్‌ను సందర్శించి ఆన్సర్ కీని




డౌన్‌లోడ్ చేసుకుని తమ సమాధానాలను సరిపోల్చుకోవాలని సూచించారు.

తుది ఆన్సర్ కీ కోసం అధికారిక వెబ్‌సైట్:



## "వానాకాలం–2026" వ్యవసాయ అత్యవసర కార్యాచరణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

- **వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు – జిల్లా వారీ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలతో సమగ్ర గ్రంథం**

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం వంటి ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యంతో తెలంగాణ వ్యవసాయ శాఖ రూపొందించిన "తెలంగాణ వ్యవసాయ అత్యవసర & ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక - వానాకాలం-2026" పుస్తకాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవడం, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం, పంటల సంరక్షణ చర్యలు చేపట్టడంలో ఈ పుస్తకం సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ సమాచారం, వాతావరణ అంచనాలు, జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికలు, పంటల నిర్వహణ సూచనలను సమన్వయం చేస్తూ ఈ గ్రంథాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ (IMD), ఐసీఏఆర్-క్రిడా (ICAR-CRIDA), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTAU), శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం (SKLTGHU), ఐసీఆర్ఐశాట్ (ICRISAT), భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (IIMR), భారత నూనెగింజల పరిశోధన సంస్థ (IIOR), నీటిపారుదల, విద్యుత్, భూగర్భ జల శాఖల సాంకేతిక సహకారంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

ఈ గ్రంథంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాత విశ్లేషణ, వాతావరణ అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితి, జలాశయాల్లో నీటి లభ్యత, జిల్లా వారీ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల లభ్యత, రైతులకు అవగాహన కార్యక్రమాలపై సమగ్ర సమాచారం పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్‌తో పాటు వివిధ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు సమయానుకూలంగా పంటల ఎంపిక, సాగు నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను అమలు చేయడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి ఈ పుస్తకం ప్రామాణిక మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# ప్రతిభకు పురస్కారం.. ఉద్యోగాల భరోసా!

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులు ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అభినందించిన సీఎం వారికి నగదు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని రూపొందించి అమలు చేస్తున్నామని, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, గతంలో జాతీయ స్థాయి క్రీడలకు హైదరాబాద్ ప్రధాన వేదికగా నిలిచిందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు టీజీ20 క్రికెట్ లీగ్ మంచి అవకాశంగా మారిందని సీఎం పేర్కొన్నారు. విజేతలైన హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో దేశానికి కీర్తి తీసుకువచ్చే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు ఎంచుకున్న రంగంపై గౌరవం, అంకితభావం అవసరమని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.




# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..

- **'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి**
- **భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు**
- **ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి**
- **త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన**
- **పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు**
- **నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం**

**ఆంధ్రప్రదేశ్, ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీవీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## పార్లమెంట్ ముందుకు సవరించిన డీలిమిటేషన్ బిల్లు..

**ఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్**

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే గుర్తుచేశారు. తమ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 2026 కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తుచేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచనున్నారు.

## "సీతారామ ప్రాజెక్టుపై తగ్గేదే లేదు..

**మొదటిపేజీ తరువాయి**

సంకల్పంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు.

**వైఎస్సార్ హయాంలోనే పునాది.. కేసీఆర్ పాలనలో వ్యయం పెంపు**

గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీడిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు.

**వెనక్కి తగ్గేదే లేదు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



# కుమ్మరుల తొలి బోనం తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- **మట్టి పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలి.. కుమ్మరుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు: ఎంపీ ఈటల రాజేందర్**

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయంలో తెలంగాణ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి బోనం సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుమ్మర సంఘం ప్రతినిధులు, భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో కుమ్మర జాతికి ఉన్న విశిష్ట స్థానాన్ని కొనియాడారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం బోనాల పండుగలో తొలి బోనం సమర్పించే గౌరవం కుమ్మర సమాజానికే దక్కడం వారి సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. గోల్కొండ జగదాంబిక ఆలయంలో ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాల అనంతరం కట్టమైసమ్మ, లష్కర్ బోనాలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా జరిగే బోనాల వేడుకల్లో కుమ్మరులు తొలి బోనం సమర్పించిన తర్వాతే ప్రజలు బోనాలు సమర్పించడం చిరకాలంగా కొనసాగుతున్న ఆచారమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ సంప్రదాయాలను, విశ్వాసాలను కాపాడుకుంటూ అమ్మవారిని ప్రార్థించడం తెలంగాణ సంస్కృతికి గొప్ప గుర్తింపుగా నిలుస్తోందన్నారు. 2018 సంవత్సరం నుంచి ట్యాంక్‌బండ్ శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో తెలంగాణ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా బోనాల ఉత్సవాలకు శుభారంభం పలుకుతున్నారని తెలిపారు. ఈ సంప్రదాయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న సంఘం ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. మనిషి జననం నుంచి అంత్యక్రియల వరకు, అలాగే వివాహాలు, శుభకార్యాలు, ధార్మిక కార్యక్రమాల్లో కుమ్మరులు తయారు చేసే మట్టి పాత్రల వినియోగం భారతీయ జీవన విధానంలో విడదీయరాని భాగమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రతి ఇంట్లో మట్టి పాత్రలే ఉపయోగించేవారని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్లాస్టిక్, రసాయనాలతో తయారైన వస్తువుల వినియోగం పెరగడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి పాత్రల వినియోగం పెరిగితే ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని చెప్పారు. ఆరోగ్యం కంటే విలువైనది మరొకటి లేదని, అందువల్ల సంప్రదాయ మట్టి పాత్రల వినియోగాన్ని ప్రభుత్వం, ప్రజలు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కుమ్మర సమాజం ఎన్నో తరాలుగా సమాజానికి సేవలందిస్తున్నప్పటికీ వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఈటల రాజేందర్ కోరారు. కుమ్మరుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడం, మట్టి సేకరణకు చెరువులను కేటాయించడం, మట్టి పాత్రల తయారీ, విక్రయాలకు ప్రోత్సాహక చర్యలు చేపట్టడం వంటి డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని అన్నారు. కుమ్మర సంఘం చేపడుతున్న ఉద్యమాలకు, వారి సంక్షేమానికి తాము ఎప్పటికీ అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, ట్యాంక్‌బండ్ కుమ్మర సంఘం కమిటీని అభినందించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆషాఢ మాస బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.





# కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలి

- **జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ.. దిశానిర్దేశం చేసిన వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా**





**వికారాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

నేరాల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసులను త్వరితగతిన ఛేదించాలని వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని దర్యాప్తు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ శిక్షణలో కాల్ డీటైల్ రికార్డులు (CDR), ఇంటర్నెట్ ప్రోటోకాల్ డీటైల్ రికార్డులు (IPDR), టవర్ డంప్ అనాలిసిస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) తదితర సోషల్ మీడియా వేదికల విశ్లేషణతో పాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసుల ఛేదన, డిజిటల్ ఆధారాల సేకరణ వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో నేరస్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నందున దర్యాప్తు అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. సీడీఆర్, ఐపీడీఆర్, టవర్ డంప్ డేటా విశ్లేషణతో పాటు సోషల్ మీడియా వేదికలు, హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా కీలక సమాచారాన్ని సేకరించి నేరస్థులను వేగంగా గుర్తించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రతి దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించాలని ఎస్పీ ఆదేశించారు. డిజిటల్ సాక్ష్యాలను చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచి, కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాల దర్యాప్తులో డిజిటల్ ఇంటెలిజెన్స్‌ను మరింత సమర్థంగా వినియోగించాలని చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ గుర్తించడం, సోషల్ మీడియా వేదికల ద్వారా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడంలో సాంకేతిక విశ్లేషణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్ ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం శిక్షణ పొందుతూ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, ఐటీ సెల్ ఎస్ఐ శంకర్, ఐటీ సెల్ సిబ్బంది, జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన
# నీటిపారుదల శాఖ అధికారులు

- **ఎన్‌వోసీ కోసం రూ.60 వేల డిమాండ్.. ఈఈ, ఏఈలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**

**ఆదిలాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

ఆదిలాబాద్ జిల్లాలో లంచం తీసుకుంటూ నీటిపారుదల శాఖకు చెందిన ఇద్దరు అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. విమల పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు అవసరమైన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయడానికి రూ.60 వేల లంచం డిమాండ్ చేసిన నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) రాథోడ్ మిట్టల్, అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) రమేష్‌లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం, బాధితుడు చౌహాన్ విక్రమ్ తన పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు అవసరమైన ఎన్‌వోసీ కోసం సంబంధిత అధికారులను సంప్రదించగా, పని చేయాలంటే రూ.60 వేల లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. లంచం ఇవ్వడానికి నిరాకరించిన బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని, కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.60 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో ఈఈ రాథోడ్ మిట్టల్, ఏఈ రమేష్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.





# ఖమ్మం త్రీటౌన్ పరిధిలో విస్తృత తనిఖీలు.. గంజాయి విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

**ఖమ్మం, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణకు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు ఆధ్వర్యంలో పాడుబడ్డ భవనాలు, నిర్మానుష్య ప్రాంతాలు, పార్కులు, కిరాణా దుకాణాలు, పాన్‌షాపుల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాల ముసుగులో జరుగుతున్న అక్రమ విక్రయాలను గుర్తించి బాధ్యులపై, తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు హెచ్చరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు.. సాంకేతికతతో ఎదుర్కోవాలి: డీజీపీ సి.వి. ఆనంద్

- **తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్ష – AI ఆధారిత సేవలు విస్తరించాలని ఆదేశం**

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థంగా నియంత్రించేందుకు అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులకు సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించిన ఆయన, సైబర్ నేరాలు భవిష్యత్‌లో అతిపెద్ద సవాలుగా మారనున్నాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (SOC), డిజిటల్ ఫోరెన్సిక్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ తదితర విభాగాల పనితీరును పరిశీలించారు. AI ఆధారిత కాల్ సెంటర్ ద్వారా బాధితుల ఫిర్యాదులను వేగంగా స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరే విధానాన్ని అభినందిస్తూ, ఈ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, 2025లో రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనా, గత ఏడాదితో పోలిస్తే నష్టాల్లో 20 శాతం తగ్గుదల నమోదైంది. అలాగే ఫిర్యాదులు 3 శాతం తగ్గగా, నేరస్థుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే (POH) చర్యలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా నమోదైన 49,620 సైబర్ ఎఫ్ఐఆర్‌లలో తెలంగాణలోనే 21,639 కేసులు నమోదవడం రాష్ట్ర పోలీసుల చురుకుదనానికి నిదర్శనమని అధికారులు తెలిపారు. రూ.75 లక్షలకు పైగా నష్టం జరిగిన కేసుల్లో 78 శాతం, రూ.1 లక్షకు పైగా నష్టం ఉన్న కేసుల్లో 56 శాతం ఎఫ్ఐఆర్ కన్వర్షన్ రేటు నమోదు కావడం విశేషమన్నారు. సైబర్ నేరాల వల్ల కుటుంబాలు జీవితకాల పొదుపులను కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన డీజీపీ, ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి AI, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సైబర్ నేరాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని, OTPలు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని తెలంగాణ పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.





## వైఎస్ఆర్ హయాంలో ప్రాజెక్టుల అవినీతి

**ఖమ్మం బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గురై కూనరిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని జలయజ్ఞం అని ధనయజ్ఞంగా మార్చి మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట దోపిడీ చేసి ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మార్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9 వేల కోట్లు వెచ్చించి, 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని, అధిక సామర్థ్యం గల మోటార్లు, ఆధునిక యంత్ర పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు.

## సేఫ్ సిటీతో హైదరాబాద్‌కు మరింత భద్రత..
# సాంకేతిక పోలీసింగ్‌కు డీజీపీ దిశానిర్దేశం

- **మహిళల భద్రత, సీసీటీవీ నిఘా, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి – మరో 12 మొబైల్ షీ టాయిలెట్ల ఏర్పాటు**



**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక సేఫ్ సిటీ ప్రాజెక్టు అమలుపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్, రవాణా తదితర శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సమీక్షలో భాగంగా నగర భద్రత కోసం అత్యాధునిక సీసీటీవీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. మహిళల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న 12 మొబైల్ షీ టాయిలెట్లకు అదనంగా మరో 12 ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

షీ టీమ్స్, భరోసా సెంటర్లు, హాక్ఐ యాప్, సేఫ్ ట్రావెల్ వంటి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొంటూ, మహిళలు నిర్భయంగా సంచరించే వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు.

సేఫ్ సిటీ ప్రాజెక్టు తొలి దశలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలో 2,306 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయగా, రెండో దశలో మరో 862 కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని అధికారులు వివరించారు. అలాగే నగరంలోని అన్ని సీసీటీవీలు, 404 ట్రాఫిక్ సిగ్నల్స్ నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు.

సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్ నిర్మూలన వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

సాంకేతికత ఆధారిత పోలీసింగ్ ద్వారా నేరాల నియంత్రణ, వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు సత్వర సహాయం అందించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. సేఫ్ సిటీ ప్రాజెక్టు ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, ప్రజలకు అనుకూల నగరంగా తీర్చిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు.

# సీతారామ టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

- **త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం.. నాణ్యత, వేగంపై అధికారులకు ఆదేశాలు**

**ఖమ్మం, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

ఖమ్మం జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక సీతారామ ఎత్తిపోతల పథకంలోని టన్నెల్ పనుల పురోగతిని రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించిన వారు అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, ఎదురవుతున్న సాంకేతిక అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన తాజా పరిస్థితిని మంత్రులకు వివరించారు. టన్నెల్ తవ్వకం, లైనింగ్, యంత్రాల పనితీరు, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి ఎంతో కీలకమైన సాగునీటి పథకమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఒక్కో రోజు పురోగతిని పర్యవేక్షిస్తూ ఎక్కడా జాప్యం లేకుండా పనులు సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలకూ దోహదపడుతుందని తెలిపారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని, నిర్ణీత గడువులోపు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి ఖమ్మం సహా పరిసర జిల్లాల రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. పనుల పురోగతిని ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతులను సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. పరిశీలన సందర్భంగా అధికారులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







# 25 నుంచి పాతబస్తీలో మూడు రోజుల తబ్లిక్-ఎ-జమాత్ ఇస్తామా

- **ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని వినతి.. హామీ ఇచ్చిన ఆర్టీసీ ఎండీ**

**హైదరాబాద్, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ పాతబస్తీలోని సాయిన్‌నగర్‌లో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు తబ్లిక్ఎజమాత్ ఇస్తామా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 3,000 మంది మత విశ్వాసులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.
ఈ నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను గురువారం తబ్లిక్ఎజమాత్ ప్రతినిధులు ఇసాక్, మహ్మద్ మదీన్, అబ్దుల్ ఖాదర్, మొయిన్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.
వినతిపై వెంటనే స్పందించిన మహమ్మద్ అలీ షబ్బీర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఐపీఎస్‌తో మాట్లాడారు. కార్యక్రమానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు, ఇమ్లిబన్ బస్ స్టేషన్ నుంచి సాయిన్‌నగర్ వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# మట్టపల్లి క్షేత్ర అభివృద్ధికి రూ.13 కోట్లు

- **పర్యాటక సౌకర్యాలు, బోటింగ్ అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలనా అనుమతి**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**




సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలంలో ఉన్న ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.13 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. దేవాలయ పరిసరాల్లో పర్యాటక మౌలిక వసతుల కల్పనతో పాటు బోటింగ్ కార్యకలాపాల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించనున్నారు.
ఈ ప్రతిపాదనకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పలుమార్లు చర్చించి నిధుల మంజూరుకు కృషి చేసినట్లు వెల్లడించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి మేరకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) అధికారులు క్షేత్రాన్ని పరిశీలించి రూ.13 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి జారీ చేసింది. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో ఆధునిక పర్యాటక సౌకర్యాలు, సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు, బోటింగ్ సదుపాయాలు, ఇతర పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దీంతో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మట్టపల్లి క్షేత్రాన్ని రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మట్టపల్లి క్షేత్ర అభివృద్ధికి పరిపాలనా అనుమతి లభించడంపై స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ వ్యవహారంపై దేశవ్యాప్త 12 గంటల నిరాహార దీక్షకు పిలుపు

- **జూలై 20న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు శాంతియుత నిరసన చేపట్టాలని 'సంవిధాన్ బచావో సంఘర్ష్ సమితి' పిలుపు**

**న్యూఢిల్లీ, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

నీట్ (యూజీ) పరీక్షల నిర్వహణ, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం అంశాలపై దేశవ్యాప్తంగా 12 గంటల నిరాహార దీక్ష నిర్వహించాలని సంవిధాన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపునిచ్చింది. జూలై 20, సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దేశవ్యాప్తంగా స్థానిక స్థాయిలో శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సమితి విజ్ఞప్తి చేసింది.
న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరు కాలేని వారు తమ తమ జిల్లాలు, పట్టణాలు, విద్యా సంస్థలు లేదా నివాస ప్రాంతాల్లో నిరాహార దీక్ష చేపట్టాలని పిలుపునిచ్చింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం ప్రకటించాలని కోరింది. సమితి విడుదల చేసిన ప్రకటనలో, నీట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన పరిణామాలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశాయని పేర్కొంది. పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతిన్నదని, దీనిపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ఈ పరిస్థితుల కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరింది. ఈ సందర్భంగా సమితి మూడు ప్రధాన డిమాండ్లను ప్రకటించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధిపతి ప్రదీప్ జోషిపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ వ్యవహారంతో సంబంధం ఉందని పేర్కొంటున్న పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసింది.
నిరాహార దీక్షతో పాటు జిల్లా కేంద్రాలు, విద్యా సంస్థల వద్ద నిశ్శబ్ద ధర్నాలు నిర్వహించాలని, సామాజిక మాధ్యమాల్లో హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా డిజిటల్ ఉద్యమాన్ని కూడా నిర్వహించాలని సమితి పిలుపునిచ్చింది.
అయితే, ఈ డిమాండ్లు మరియు ఆరోపణలు సంవిధాన్ బచావో సంఘర్ష్ సమితి చేసినవేనని, వాటిపై సంబంధిత ప్రభుత్వాలు లేదా అధికార సంస్థల అధికారిక స్పందన ఈ ప్రకటనలో ప్రస్తావించబడలేదని గమనించాల్సి ఉంది.







# రథయాత్ర పర్వదినం సందర్భంగా ప్రధాని శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:**

పవిత్ర రథయాత్ర పర్వదినం సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. రథయాత్ర భారతదేశ శాశ్వత ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రథయాత్రకు సంబంధించిన సంప్రదాయాలు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా తరతరాల ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. వినయం, సామూహిక భాగస్వామ్యం, నిస్వార్థ సేవ వంటి విలువలను ఈ ఉత్సవం ప్రతిబింబిస్తుందని అన్నారు.
మహాప్రభు జగన్నాథుడు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించాలని, అన్ని రంగాల్లో విజయాలను అందించాలని, సమాజంలో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.
"జై జగన్నాథ్!" అంటూ ప్రధాని తన సందేశాన్ని ముగించారు.

# అమరావతిలో ఆధ్యాత్మిక వైభవం.. తొలి జగన్నాథ రథయాత్రలో సీఎం పాల్గొనడం

- **జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవి రథాన్ని లాగి ప్రత్యేక పూజలు.. వేలాది మంది భక్తులతో కలిసి పవిత్ర క్రతువులో సీఎం భాగస్వామ్యం**

**అమరావతి, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**



రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర భక్తి, ఆధ్యాత్మికత, సనాతన సంప్రదాయాల సమ్మేళనంగా అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక రథయాత్రలో ముఖ్యమంత్రి పాల్గొని భక్తులతో కలిసి జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి ఆశీనులైన రథాన్ని లాగుతూ పవిత్ర క్రతువులో భాగస్వాములయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుభిక్షం కలగాలని ప్రార్థించారు. అమరావతిలో తొలిసారి నిర్వహించిన ఈ రథయాత్రకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. హరినామ సంకీర్తనలు, భజనలు, వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు గోవింద నామస్మరణతో రథయాత్రలో పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రథయాత్ర సాగిన మార్గమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జగన్నాథ రథయాత్ర భారతీయ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే మహోన్నత ఆధ్యాత్మిక ఉత్సవమని పేర్కొన్నారు. ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశిష్టత తెలిసిందేనని, అదే ఆధ్యాత్మిక స్ఫూర్తితో రాజధాని అమరావతిలో కూడా తొలిసారి ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, సేవాభావం, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఆధ్యాత్మిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలు, పరస్పర గౌరవం, సేవా భావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. అమరావతి రాజధాని పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
ఈ మహత్తర రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించిన అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మధు పండిట్ దాసా, హరే కృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షులు శ్రీ వంశీధర దాసాకు ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు, భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. రథయాత్ర సందర్భంగా భక్తులకు తాగునీరు, ప్రసాదం, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు విస్తృతంగా చేశారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన ఈ జగన్నాథ రథయాత్ర ఆధ్యాత్మిక చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచిందని భక్తులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ప్రతి ఏడాది ఇదే స్థాయిలో రథయాత్రను నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అమరావతి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను మరింత పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.



# లేని భూమిని అమ్మి మోసం.. ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

**సూర్యాపేట, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

భూముల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడిని చివ్వెంల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రూరల్ సీఐ జి. రాజశేఖర్ వెల్లడించారు.
అయిలాపురం గ్రామ శివారులోని భూమిని ప్లాట్లుగా విక్రయిస్తానని చెప్పి, వాస్తవానికి ఇతరులకు చెందిన భూమిని తనదిగా చూపించి కోడదల వెంకన్న, కోడదల కనకయ్యల నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసిన కాసర్ల సురేందర్ రెడ్డిపై బాధితుడి ఫిర్యాదు మేరకు చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.
చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ నిర్వహించిన విచారణలో సంబంధిత భూమి నిందితుడికి చెందలేదని, ఇతరుల భూమిని తనదిగా చూపించి పలువురిని మోసం చేసినట్లు ఆధారాలు లభించినట్లు సీఐ తెలిపారు. సేకరించిన సాక్ష్యాల ఆధారంగా నిందితుడు కాసర్ల సురేందర్ రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించిందన్నారు.
వ్యవస్థీకృతంగా భూ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. ఈ తరహా మోసాలకు గురైన ఇతర బాధితులు కూడా పోలీసులను సంప్రదించాలని సూచించారు.
భూముల కొనుగోలు, విక్రయాల సమయంలో సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, యాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారుల ద్వారా ధృవీకరించుకున్న అనంతరమే లావాదేవీలు జరపాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆస్తి కోసం అత్తను హత్య చేసిన కోడలు.. తుంగతుర్తి పోలీసులు కేసు ఛేదింపు

**సూర్యాపేట, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

ఆస్తివివాదం నేపథ్యంలో అత్తను హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించిన ఘటనను తుంగతుర్తి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితురాలైన కోడలు కొణతం మధురను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట డీఎస్పీ కార్యాలయంలో తుంగతుర్తి సీఐ బి. ఉపేందర్ రావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన కొణతం భాగ్యమ్మ ఏప్రిల్ 28, 2026న అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ఆమె కుమార్తె ఉప్పు శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగ్యమ్మ కోడలు కొణతం మధురే హత్య చేసినట్లు తేలింది. భాగ్యమ్మకు చెందిన సుమారు ఆరు ఎకరాల భూమిలో తనకు వాటా కావాలని కుమార్తె శోభ కోర్టును ఆశ్రయించడంతో కుటుంబంలో విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27 రాత్రి భూమి వాటా విషయమై అత్త-కోడళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఆస్తి మొత్తం తమకే దక్కాలనే ఉద్దేశంతో నిందితురాలు భాగ్యమ్మను బలంగా తోసివేయడంతో ఆమె కిందపడింది. అనంతరం మళ్లీ లేచిన భాగ్యమ్మను వెనుక నుంచి పట్టుకుని మంచంపైకి బలంగా నెట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్య అనంతరం భాగ్యమ్మ మంచం మీద నుంచి పడిపోయి సహజంగా మరణించిందని బంధువులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే అంత్యక్రియలకు ముందు మృతదేహానికి స్నానం చేయించే సమయంలో శరీరంపై గాయాలను గమనించిన కుమార్తె, బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు మలుపు తిరిగింది.

# దేశవ్యాప్తంగా 75 ఆధునిక రైల్వే స్టేషన్లు సిద్ధం

- **నేడు జాతికి అంకితం.. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో మరో కీలక ఘట్టం**

**న్యూఢిల్లీ, జూలై 16, ఆశ్వి అప్డేట్స్:**

దేశవ్యాప్తంగా ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందించే లక్ష్యంతో పునర్వ్యవస్థీకరించిన 75 రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం జాతికి అంకితం చేయనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన ఈ స్టేషన్లు ఆధునిక సౌకర్యాలు, మెరుగైన ప్రయాణ అనుభవం, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే నిర్మాణ శైలితో కొత్త రూపును సంతరించుకున్నాయి. ఈ పథకం ద్వారా రైల్వే స్టేషన్లను కేవలం రైళ్లు ఆగే ప్రదేశాలుగా కాకుండా, ప్రయాణికులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించే ఆధునిక రవాణా కేంద్రాలుగా తీర్చిదిద్దారు. విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఆధునిక వేచిచూసే మందిరాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మెరుగైన తాగునీటి సౌకర్యం, డిజిటల్ సమాచార వ్యవస్థలు, ఎల్ఈడీ లైటింగ్, సీసీటీవీ నిఘా, ఎస్కలేటర్లు, లిఫ్టులు, వికలాంగులకు అనుకూల ర్యాంపులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. ప్రతి స్టేషన్‌ను ఆ ప్రాంత చరిత్ర, వారసత్వం, సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా రూపకల్పన చేయడం ఈ పథకం ప్రత్యేకతగా నిలిచింది. దీంతో ప్రయాణికులకు సౌకర్యాలతో పాటు స్థానిక గుర్తింపును కూడా ఈ స్టేషన్లు అందించనున్నాయి. రైల్వే మౌలిక సదుపాయాల ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమం దేశవ్యాప్తంగా రైలు ప్రయాణ ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా భద్రత, పరిశుభ్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రూపొందించిన ఈ స్టేషన్లు భారతీయ రైల్వేలో నూతన అధ్యాయానికి నాంది పలుకనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా వందలాది రైల్వే స్టేషన్లను దశలవారీగా ఆధునికీకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలో నేడు జాతికి అంకితం కానున్న 75 స్టేషన్లు భారత రైల్వే అభివృద్ధి ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలవనున్నాయి.







# ఒత్తిడిని జయించండిలా..!

వ్యక్తిగత జీవితం, ఉద్యోగ జీవితం సమన్వయం చేసుకొనే క్రమంలో చాలా మంది ఒత్తిడికి గురవుతుంటారు. స్ట్రెస్, డిప్రెషన్ అనేవి అనేక ఇతర వ్యాధులకు కూడా కారణం అవుతున్నాయి. తాత్కాలికమైన ఒత్తిడి వల్ల కొన్ని లాభాలున్నప్పటికీ.. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్తున్నారు. అసలు ఈ ఒత్తిడిని ఎలా జయించాలి? మానసిక నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం.



## ధ్యానంతో రిలాక్స్

రోజుకు కొన్ని నిమిషాలపాటు ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. ప్రశాంతమైన మ్యూజిక్ వినడంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది. పచ్చదనం ఉన్న ప్రాంతంలో వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. నిరంతర వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. వ్యాయామం చేసే సమయంలో ఎండార్ఫిన్ విడుదలవుతుంది. దీన్ని ద్వారా ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.


## ముందుగా ఒత్తిడిని గుర్తించండి


ఒత్తిడిని జయించాలంటే ఒత్తిడి ఎందుకు వచ్చిందో తెలుసుకోవడం మొదటి అడుగు. ముందు ఒత్తిడి కలిగించే వ్యక్తులు, పరిస్థితులను అధ్యయనం చేయాలి. అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా చూసుకోవాలి. మీకు ఒత్తిడి కలిగించే వ్యక్తులకు దూరంగా ఉండాలి.


## ఆరోగ్యకరమైన ఆహారం కూడా..

ఒత్తిడిని జయించాలంటే పండ్లు, కూరగాయలు, మాంసాహారాలు, తృణ ధాన్యాలు తీసుకోవాలి. అధిక కాఫీ, మద్యపానాలు, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు సైతం ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం బెటర్. ఇక ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడటం.. పుస్తకాలు చదవడం ద్వారా కూడా ఒత్తిడిని జయించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.









# లెమన్ ఆయిల్‌తో ఒత్తుగా జుట్టు


జుట్టుగా ఒత్తుగా ఉండాలన్నది అందరి కల. కానీ ప్రస్తుత జీవనశైలి, పని ఒత్తిడి తదితర కారణాలతో జుట్టు రాలుతూనే ఉంది తప్ప.. ఒత్తుగా ఉండటం లేదు. చాలా చిన్నవయసులోనే బట్ట తల కూడా వచ్చేస్తోంది. ఇక స్త్రీలకు పొడవైన జుట్టు.. అందమైన కురులు చక్కటి అందాన్ని ఇస్తాయి. కానీ ఇప్పుడు పొడగాటి, ఒత్తైన జుట్టు ఎక్కడా కనిపించడం లేదు. ఇక జుట్టును ఒత్తుగా ఉంచుకోవడానికి రకరకాల ఆయిల్స్, క్రీములు, షాంపూలు మార్చేస్తుంటారు. కానీ ఎన్ని ట్రై చేసినా జుట్టు మాత్రం పెరగడం లేదన్నదని యువత భావన. అయితే ఇప్పుడు బ్యుటిషియన్స్ లెమన్ ఆయిల్ తో జుట్టును ఒత్తుగా పెంచుకోవచ్చని ఓ సరికొత్త సలహా ఇస్తున్నారు. అసలు ఈ లెమన్ అయిల్ ఎలా వాడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. లెమన్ ఆయిల్ తో మీ తల మీద ఉన్న చుండ్రు, ఇతర వ్యర్థాలను తొలగించుకోవచ్చు. ఇక డ్యాండ్రఫ్, పొడి జుట్టును తగ్గించడంతోనూ ఈ ఆయిల్ సహాయపడుతుంది. లెమన్ ఆయిల్ తలలో రక్త రక్తప్రవాహాన్ని పెంచుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. తద్వారా జుట్టు మూలాలకు అవసరమైన పోషకాలు, ఆక్సిజన్ అందుతుందట. లెమన్ ఆయిల్ లో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో జుట్టు శక్తి మరింత ఇనుమడిస్తుంది.

## మసాజ్ ఎలా చేసుకోవాలి?

లెమన్ ఆయిల్‌ను కొద్దిగా నెయ్యిలో కలపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తల మీద 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేయాలి. 30 నిమిషాల అలాగే వదిలేసి రసాయనాలు లేని షాంపూతో తల స్నానం చేయాలి. ఇలా నిత్యం వాడటం వల్ల జుత్తు నిగనిగలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. లెమన్ ఆయిల్ ను నేరుగా అప్లై చేయొద్దని.. మిశ్రమంగానే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.



# వర్షా కాలంలో ఈ కూరగాయలు బెస్ట్



వర్షా కాలంలో కొన్ని కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు తరుముకొస్తుంటాయి. చిన్నపిల్లలు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. అయితే వర్షా కాలంలో కొన్ని రకాల కూరగాయాలు తీసుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కూరగాయలు పుష్కలంగా పోషకాలను అందిస్తుంటాయి. జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. ఈ కూరగాయలు మీరు ఆహారంలో చేర్చుకుంటే వర్షా కాలంలో ఆరోగ్యంగా ఉండడంలో సహాయపడతాయి.



**కాకరకాయ:** రోగనిరోధక శక్తిని పెంచడంలో, కాలేయాన్ని శుభ్రపరచడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**ఆనపకాయ:** ఈ కూరగాయలో ఉన్న నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది మరియు ఇది తేలికగా జీర్ణమవుతుంది.

**పొట్లకాయ:** ఇది మంచి డైటరీ ఫైబర్ అందిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

**బచ్చలికూర:** అధిక ఐరన్ కంటెంట్ రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

**మెంతి ఆకులు:** ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.

**మునగకాయలు:** రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మరియు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**క్యారెట్లు:** బీటా కెరోటిన్, విటమిన్ ఏ మరియు యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది, ఇవి దృష్టిని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తాయి.

**బీట్రూట్:** అధిక ఐరన్ కంటెంట్‌తో రక్తహీనతను నివారించడంలో, మరియు శక్తి స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది.

**గుమ్మడికాయ:** విటమిన్ ఏ, సీ, ఈ, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది మరియు జీర్ణక్రియకు సహాయపడుతుంది.

**బెండకాయ:** విటమిన్లు ఏ, సీ, ఫోలేట్, మరియు ఫైబర్ ఉన్నంత మాత్రాన ఇది మంచి జీర్ణక్రియను ఉంచుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఈ కూరగాయలు మీ వర్షాకాల ఆహారంలో చేర్చుకుంటే, అవి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ఈ సీజన్‌లో ప్రత్యేకమైన రోగనిరోధక ప్రయోజనాలను అందిస్తాయి.



## పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

- **పూరీ జగన్నాథ రథయాత్రలో బారికేడ్ కూలిపోయి ఒకరిపై ఒకరు పడిపోయిన భక్తులు**
- **ఊపిరాడక ఒక భక్తుడు మరణించినట్లు సమాచారం**
- **భారీ రద్దీ, వర్షం కారణంగా పలువురికి గాయాలు**
- **దాదాపు 200 మంది అస్వస్థతతో ఆసుపత్రిలో చేరినట్లు వార్తలు**
- **మరణాన్ని ఇంకా అధికారికంగా ధ్రువీకరించని అధికారులు**

**ఒడిశా, ఆశ్వి అప్డేట్స్**

ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టు తప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.



## సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

- **తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావు లేదన్న విజయ్**
- **ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని వెల్లడి**

**తమిళనాడు, ఆశ్వి అప్డేట్స్**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు. ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## తునిలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు..

- **గరీబ్ రథ్ సహా పలు ప్యాసింజర్ రైళ్లు ఆలస్యం**

**కాకినాడ, ఆశ్వి అప్డేట్స్**

కాకినాడ జిల్లా తునిలో గురువారం సాయంత్రం ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదం కారణంగా అత్యంత రద్దీగా ఉండే విశాఖపట్నం విజయవాడ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఈ గూడ్స్ రైలు, తుని పట్టణం దాటిన తర్వాత లూప్ లైన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. రైలులోని ఒక బోగీ అదుపుతప్పి పట్టాలు తప్పి పక్కకు ఒరిగింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడం, ప్రాణ నష్టం జరగకపోవడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ప్రభావంతో విశాఖపట్నం మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ సికింద్రాబాద్ గరీబ్ రథ్, ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు ఇతర రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే ఉన్నతాధికారులు, సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

# ప్రియాంక గాంధీ పేరుతో మోసం.. కేరళలో మంత్రి పదవులకు బేరం!

- **ప్రియాంక గాంధీ కార్యాలయం పేరుతో కేరళ కాంగ్రెస్ నేతలకు మోసపూరిత ఫోన్లు**
- **మంత్రి పదవులు ఇప్పిస్తామంటూ కోట్ల రూపాయల డిమాండ్**
- **ఎలత్తూర్ ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్‌కు రూ.3 కోట్లు ఇవ్వాలంటూ ఆఫర్**
- **ప్రియాంక పీఎస్ ఫిర్యాదుతో సైబర్ పోలీసుల దర్యాప్తు ప్రారంభం**
- **కాలర్ స్పూఫింగ్ టెక్నాలజీ వాడినట్లు పోలీసుల అనుమానం**



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్ నేరగాళ్లు కేరళ కాంగ్రెస్ నాయకులను మోసం చేసేందుకు యత్నించారు. రాష్ట్రంలో మంత్రి పదవులు ఇప్పిస్తామని నమ్మబలికి, వారి నుంచి కోట్ల రూపాయలు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు సైబర్ మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ మోసం ఎలత్తూర్ ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్‌కు జులై 6న వచ్చిన ఒక వాట్సాప్ కాల్‌తో వెలుగులోకి వచ్చింది. ప్రియాంక గాంధీ ఢిల్లీ కార్యాలయం నుంచి 'రాజ్‌కుమార్' అనే వ్యక్తిని మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న కాలర్, కేరళలో త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందని నమ్మబలికాడు. మంత్రి పదవి కావాలంటే రూ.3 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఇదే నంబర్ నుంచి వడకర ఎంపీ షఫీ పరంబిల్, ఇడుక్కి ఎంపీ డీన్ కురియాకోస్‌లకు కూడా ఇటువంటి కాల్స్ వచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ వ్యక్తిగత కార్యదర్శి డి.ఎస్. రాజ్‌కుమార్ కేరళ డీజీపీకి, వయనాడ్ ఎస్పీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో కల్పేట సైబర్ పోలీసులు, కోజికోడ్ సైబర్ సెల్ వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కాల్స్ ఢిల్లీ నుంచి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు, నిందితులు అత్యాధునిక 'కాలర్ స్పూఫింగ్' టెక్నాలజీని ఉపయోగించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను పోలీసులను ఆశ్రయించినట్లు ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్ తెలిపారు. ఈ విషయాన్ని ఏమాత్రం తేలిగ్గా తీసుకోబోమని వ్యవసాయ మంత్రి టి. సిద్ధిఖీ స్పష్టం చేశారు. మరోవైపు, మంత్రివర్గ విస్తరణ వార్తలను కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ తోసిపుచ్చారు.

# యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు..

- **కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ**
- **ఇంధన రంగ నిపుణుడైన కోరెట్స్కీని ఎంపిక చేసిన జెలెన్‌స్కీ**
- **కోరెట్స్కీ నియామకానికి ఆమోదం తెలిపిన ఉక్రెయిన్ పార్లమెంట్**
- **రక్షణ దళాల బలోపేతం, శీతాకాల సన్నద్ధతే ప్రధాన లక్ష్యాలు**



**ఆశ్వి అప్డేట్స్**

రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ రక్షణ దళాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడం, రక్షణ పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడం, రాబోయే శీతాకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం మా ప్రథమ కర్తవ్యం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వీటితో పాటు సామాజిక బాధ్యతలను నెరవేర్చడం, యూరోపియన్ యూనియన్‌లో చేరే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. 48 ఏళ్ల కోరెట్స్కీకి ఇంధన రంగంలో అపార అనుభవం ఉంది. అయితే, ఆయనకు గతంలో ఎలాంటి రాజకీయ పదవుల అనుభవం లేదు. రష్యా దాడుల నడుమ దేశ ఇంధన స్థిరత్వాన్ని కాపాడటంలో నాఫ్టోగాజ్ సీఈఓగా ఆయన కీలక పాత్ర పోషించారు.




## 'బ్యానర్' ఎఫెక్ట్.. అర్జెంటీనా జట్టు మొత్తంపై ఆంక్షల కత్తి..!

ఫిఫా ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో వరుసగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా.. మరో వివాదంలో చిక్కుకుంది. సెమీస్‌లో విజయం అనంతరం ఈ జట్టు మైదానంలో రాజకీయ బ్యానర్‌ను ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. దీంతో అర్జెంటీనా (Argentina) ఆటగాళ్లపై ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ బోర్డు (IFAB) ఆంక్షలు విధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 21తో ఓడించిన అర్జెంటీనా జట్టు ఫైనల్‌కు చేరింది. దీంతో మైదానంలో సంబరాలు చేసుకున్న ఆటగాళ్లు 'ఫాక్‌లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించారు. డిఫెండర్లు మార్టినెజ్, గియోవాని ఈ బ్యానర్‌ను అటూఇటూ ఊపారు. మిగతా ఆటగాళ్లు కూడా వీరితో చేరారు. అంతేకాదు.. మ్యాచ్ అనంతరం అర్జెంటీనా వైస్ ప్రెసిడెంట్ విక్టోరియా ఎక్స్‌లో చేసిన పోస్ట్ మరింత వివాదాస్పదమైంది. 'ఫాక్‌లాండ్ అర్జెంటీనాదే. ఈ నినాదాన్ని స్టేడియంకు తీసుకురాకుండా వారు నిషేధించగలరేమో..! కానీ అది మా రక్తం, గుండెల్లో నిండిపోయింది'' అని ఆమె రాసుకొచ్చారు. ఈ దీవుల విషయంలో ఈ రెండు దేశాల మధ్య కొన్ని దశాబ్దాలుగా శత్రుత్వం కొనసాగుతోన్న నేపథ్యంలో తాజా ఘటన చర్చనీయాంశమైంది.

**రూల్స్ ఏం చెబుతున్నాయి..**

వాస్తవానికి మ్యాచ్‌ల మధ్యలో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు అంతర్జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ బోర్డు కఠినమైన మార్గదర్శకాలు రూపొందించింది. ''మైదానంలో ఉండే పరికరాలపై ఎలాంటి రాజకీయ, మతపరమైన, వ్యక్తిగత చిత్రాలు ఉండకూడదు. రాజకీయ, మతపరమైన సిద్ధాంతాలను వ్యక్తీకరించేలా ఆటగాళ్లు ఎలాంటి ప్రదర్శనలు చేయకూడదు. ఆటగాళ్ల లోదుస్తులపై తయారీ లోగో మినహా ఇతర చిత్రాలేవీ కన్పించకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన జట్టు/ఆటగాళ్లపై నిర్వాహకులు, జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్లు, లేదా ఫిఫా ఆంక్షలు విధించే అధికారం ఉంది'' అని IFAB తమ రూల్‌బుక్‌లో స్పష్టం చేసింది.

**ఏంటీ వివాదం..?**

అర్జెంటీనా తూర్పు తీరానికి 480 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఫాక్‌లాండ్ దీవులు బ్రిటన్ నియంత్రణలో ఉన్నాయి. అయితే.. చరిత్ర, సంప్రదాయాల ప్రకారం ఈ దీవులు తమకే చెందుతాయంటూ అర్జెంటీనా కొన్నేళ్లుగా ఆరోపిస్తోంది. ఈ భూభాగం కోసం 1982లో ఇరు దేశాల మధ్య భీకర యుద్ధం జరిగింది. దాదాపు 74రోజుల పాటు జరిగిన యుద్ధంలో చివరకు బ్రిటిష్‌ది పైచేయి కావడంతో అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ ఉద్రిక్తతల్లో ఇరు దేశాలకు చెందిన దాదాపు 900 మంది సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

## భారత పేసర్ గుర్నూర్ బ్రార్ ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్

భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌ఐసీసీ ఆగ్రహానికి గురయ్యాడు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డే సమయంలో అనుచితంగా ప్రవర్తించినందుకు అతడికి ఆర్టికల్ 2.9 లెవల్ 1 ప్రకారం అధికారిక హెచ్చరికతోపాటు ఓ డీమెరిట్ పాయింట్‌ను జరిమానాగా ఎదుర్కొన్నాడు. 24 నెలల వ్యవధిలో అతడికిదే తొలి తప్పిదం కాబట్టి.. తక్కువ శిక్షతోనే బ్రార్ బయటపడ్డాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ప్రపోజ్ చేయగా.. బ్రార్ తన తప్పును అంగీకరించాడు. దీంతో అతడి వివరణను తీసుకున్న ఐసీసీ సదరు తప్పిదానికి చర్యలు తీసుకుంది.

**బంతి విసిరేసి..**

తొలి వన్డేలో ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ బ్యాటింగ్ చేస్తుండగా.. బ్రార్ బౌలింగ్‌కు వెళ్లాడు. బెన్ డకెట్ అంతకుముందు బంతిని బౌండరీగా మలచడంతో బ్రార్ కాస్త అసహనానికి గురయ్యాడు. తర్వాత బాల్‌ను బ్రార్ వద్దకే డకెట్ కొట్టాడు. వెంటనే ఆ బంతి తీసుకొని డకెట్‌కు కాస్త పక్కగా విసిరాడు. దీనిని తప్పిదంగా పరిగణించిన రిఫరీ జరిమానా విధించాలని ఐసీసీ కమిటీకి సూచించాడు. లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరికతోపాటు ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌లో బ్రార్ 9 ఓవర్లు వేసి 2 వికెట్లు తీసి 61 పరుగులు ఇచ్చాడు. తన చివరి ఓవర్‌ను వేసే క్రమంలో మడమ పట్టేయడంతో మధ్యలోనే డగౌట్‌కు వెళ్లిపోయాడు.

# రెండో వన్డే ఇంగ్లాండ్‌దే.. రూట్ సెంచరీ మిస్

**కార్డిఫ్:**

భారత్‌తో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 234 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జో రూట్ (99*) సెంచరీ మిస్సయ్యింది. విల్ జాక్స్ (30), సామ్ కరన్ (26), అట్కిన్సన్ (23*), జోస్ బట్లర్ (17), హ్యారీ బ్రూక్ (16), బెతెల్ (4) పరుగులు చేశారు. బెన్ డకెట్ డకౌటయ్యాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ రెండు వికెట్లు, బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, శివమ్ దూబె, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయంతో మూడు వన్డేల సిరీస్ ప్రస్తుతానికి 11తో సమమైంది. 19న లార్డ్స్ స్టేడియంలో నిర్ణయాత్మక మూడో వన్డే జరగనుంది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 44 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటైంది. శ్రేయస్ అయ్యర్ (66), విరాట్ కోహ్లీ (65) హాఫ్ సెంచరీలు సాధించారు. శుభ్‌మన్ గిల్ (31), రోహిత్ శర్మ (26) ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు ఇషాన్ కిషన్ (1), సుందర్ (2), అక్షర్ (1), దూబే (0), గుర్నూర్ బ్రార్ (7) దారుణంగా విఫలమయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, గస్ అట్కిన్సన్ 3, సకిబ్ మహమూద్ 2.. సామ్ కరన్, విల్ జాక్స్ చెరో వికెట్ తీశారు.





# అయోధ్యలో అమితాబ్ బచ్చన్ మెగా ప్లాన్ ?

బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ అయోధ్యలో తన రియల్ ఎస్టేట్ పెట్టుబడులను వరుసగా విస్తరిస్తున్నారు. గత కొన్నేళ్లలో ఆయన రామనగరిలో రూ.100 కోట్లకు పైగా విలువైన భూములను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో అయోధ్యలో అత్యధిక స్థాయిలో పెట్టుబడులు పెట్టిన ప్రముఖ సినీ సెలబ్రిటీల్లో అమితాబ్ బచ్చన్ అగ్రస్థానంలో నిలిచారు. హిందుస్తాన్ టైమ్స్ కథనం ప్రకారం.. 2026 మార్చిలో ముంబైకి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'ది హౌస్ ఆఫ్ అభినందన్ లోధా (HoABL)' నుంచి అమితాబ్ బచ్చన్ 2.67 ఎకరాల భూమిని రూ.35 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ స్థలం HoABL అభివృద్ధి చేస్తున్న 75 ఎకరాల విలాసవంతమైన 'ది సరియు' ప్రాజెక్ట్‌కు సమీపంలో ఉంది. ఇదే డెవలపర్‌తో ఆయన చేసిన మూడో ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్‌గా పేర్కొంటున్నారు.

అంతకుముందు 2025 మే నెలలో 'ది సరియు' ప్రాజెక్ట్‌కు ఆనుకుని ఉన్న 25,000 చదరపు అడుగుల ప్లాట్‌ను సుమారు రూ.40 కోట్లకు అమితాబ్ సొంతం చేసుకున్నారు. అలాగే 2025 మార్చిలో రామ మందిరానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న 54,454 చదరపు అడుగుల భూమిని 'హరివంశ్ రాయ్ బచ్చన్ ట్రస్ట్' పేరిట కొనుగోలు చేశారు. ఈ స్థలంలో తన తండ్రి, ప్రముఖ కవి డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ స్మారకార్థం ఓ భారీ స్మారక నిర్మాణాన్ని చేపట్టే ఆలోచనలో బిగ్ బీ ఉన్నట్లు సమాచారం. ఇక 2024లో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు కూడా అమితాబ్ బచ్చన్ అయోధ్యలో వరుస పెట్టుబడులు పెట్టారు. HoABL అభివృద్ధి చేస్తున్న 'ది సరియు' ప్రాజెక్ట్‌లోని 10,000 చదరపు అడుగుల ప్లాట్‌ను రూ.14.5 కోట్లకు కొనుగోలు చేశారు. అదే ఏడాది జనవరిలో రామ మందిర ప్రారంభోత్సవానికి కొద్ది రోజుల ముందు 'హవేలీ అవధ్' ప్రాజెక్ట్‌లో 5,372 చదరపు అడుగుల ప్లాట్‌ను రూ.4.54 కోట్లకు సొంతం చేసుకున్నారు. అయోధ్యలో ఆయన చేసిన తొలి రియల్ ఎస్టేట్ పెట్టుబడి ఇదే. వరుసగా భూములు కొనుగోలు చేస్తూ అయోధ్యలో తన పెట్టుబడులను పెంచుకుంటున్న అమితాబ్ బచ్చన్, రామనగరి రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై తన విశ్వాసాన్ని మరోసారి చాటుకున్నారని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ప్రభాస్ 'ఫౌజీ' అప్‌డేట్ వచ్చేసింది..

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది.

'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




# నితిన్ 'మాస్టర్ స్ట్రాటజీ'..

కొన్నేళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న టాలీవుడ్ హీరో నితిన్ ఇప్పుడు భారీ కంబ్యాక్ కోసం పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. వరుస ఫ్లాప్‌లతో కెరీర్ డెంజర్ జోన్‌లో ఉన్న హీరో నితిన్ ఇప్పుడు ఒకేసారి మూడు విభిన్న ప్రాజెక్ట్‌లను లైన్లో పెట్టి మరోసారి సక్సెస్ బాట పట్టాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కమర్షియల్ ఎంటర్‌టైనర్ నుంచి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా వరకు, అలాగే కొత్త దర్శకుడితో మరో ప్రాజెక్ట్‌ను కూడా ఆయన ఓకే చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నితిన్ నటిస్తున్న కమర్షియల్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉందట. ఈ చిత్రాన్ని ఏడాది క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు నేచురల్ స్టార్ నాని నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌లో నితిన్ ఓ కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని టాక్. ఈ సినిమా విభిన్నమైన స్టోరీతో తెరకెక్కనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.

# రాణి ముఖర్జీకి అరుదైన గౌరవం..

బాలీవుడ్ స్టార్ నటి రాణి ముఖర్జీకి ఒక అరుదైన గౌరవం దక్కింది. మెల్‌బోర్న్ వేదికగా జరగనున్న 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' (IFFM) వేడుకల్లో భాగంగా.. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ 'లా ట్రోబ్ యూనివర్సిటీ' ఆమెకు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అందించనుంది. భారతీయ సినిమాకు ఆమె చేసిన అద్భుతమైన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటిస్తున్నారు. ఆగస్ట్ 14న మెల్‌బోర్న్‌లోని ఫెడరేషన్ స్క్వేర్‌లో ఈ డిగ్రీని అందజేయనున్నట్లు సమాచారం. తాజాగా, ఈ విషయంపై రాణి ముఖర్జీ సంతోషం వ్యక్తం చేశారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. లా ట్రోబ్ యూనివర్సిటీ నుండి ఈ గౌరవ డాక్టరేట్ అందుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందని రాణి ముఖర్జీ చెప్పారు. తన జీవిత ప్రయాణంలో సినిమానే తనకు అతిపెద్ద గురువని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి, ప్రజల్లో సానుభూతిని నింపడానికి కథలకి ఎంతో శక్తి ఉందని తాను ఎప్పుడూ నమ్ముతానని ఆమె తెలిపారు. ప్రపంచ వేదికపై భారతీయ సినిమాను నిరంతరం గౌరవిస్తూ వస్తున్న 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' (IFFM) వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందుకోవడం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోందని అన్నారు. ఇంతటి గొప్ప గుర్తింపు ఇచ్చినందుకు లా ట్రోబ్ యూనివర్సిటీ, IFFM సంస్థలకి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టాలను ఎదురించి నిలబడే మనుషుల పట్టుదల, ధైర్యం, జీవిత పోరాటాల కథలను చెప్పే ఎన్నో స్ఫూర్తిదాయకమైన సినిమాల్లో నటించే భాగ్యం తనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవీయ కోణంలో సాగే కథలు తనను ఎప్పుడూ కదిలిస్తాయని, సినిమా వల్ల తాను ఎన్నో జీవితాలను జీవించగలిగానని అన్నారు.





# అందరినీ మెప్పించాల్సిన అవసరం లేదు..

"మీ గురించి విమర్శకులు ఏమనుకున్నా పర్వాలేదు కానీ మీకు మీరు నిజాయతీగా ఉండండ"ని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. ఓ సందర్భంలో ప్రతికూల వ్యక్తుల పట్ల మనం ఎలాంటి వైఖరిని అలవర్చుకోవాలో, వారి మాటల్ని ఎలా ఎదుర్కోవాలో కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుందామె. "నేను నటించే పాత్రల్లో కాకుండా.. నన్ను నన్నుగా చూడాలని ప్రేక్షకుల నుంచి ఎలాంటి అంచనాలు పెట్టుకోను. అలాంటి అంచనాలు కేవలం నా ప్రియమైన వారిపైనే ఉంటాయి. ఎవరైనా మిమ్మల్ని పనికిరానివారని అంటే.. మీరు నిజంగానే పనికిరానివారైపోతారా? కాదు కదా. కాబట్టి, విమర్శించేవారు ఏమనుకున్నా.. ఏమన్నా సరే పట్టించుకోకండి. మీ కుటుంబం, అభిమానుల పట్ల నిజాయతీగా ఉండండి. మిమ్మల్ని ప్రేమించే వారి పట్ల నిజాయతీగా ఉంటూ మీ శక్తి మేరకు ఉత్తమంగా ఉండడానికి ప్రయత్నించండి. అదే చాలు. అందరినీ మెప్పించాలనే ఒత్తిడిని పక్కన పెట్టేయండి. అప్పుడు జీవితం బాగుంటుంద"ని చెప్పింది. 'వారణాసి' గురించి చెప్తూ.. 'ఈ సినిమా కోసం నేను 14నెలలుగా పనిచేస్తున్నా. ఈ చిత్రంలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేశాను. ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేన'ని అంది ప్రియాంక.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S